# నిద్రా దరిద్రుడు

మన సాహిత్యంలో ఒక కావ్యంతోనో ఒక నాటకంతోనో ఒకే ఒక నవలా రచనతోనో సుప్రసిద్ధులై శశ్వత్ శాశ్వత కీర్తి సంపాదించుకున్న మహనీయులు ఎందరో వుండవచ్చు. లేదా కన్యాశుల్కంతో గురజాడ, వరవిక్రయంతో కాళ్ళకూరి, కాలాతీత వ్యక్తులతో శ్రీమతి డాక్టర్ శ్రీదేవిలా చిర యశస్సు సంపాదించుకొని పాఠకుల హృదయ సామ్రాజ్యంలో శాశ్వతంగా నిలిచి పోవచ్చు. వాళ్ళు మరెన్నో రచనలు చేసి వుండవచ్చు అయితే ఈ రచనలు కీర్తి సంతరించుకోక పోవడంవల్ల అవి గుర్తులో నిలువలేదు.

అలాగే కీర్తి శేషులు శంకరం బాడి సుందరాచార్యులు అనే కీర్తి శేషులుబు ద్ధగీత లాంటి లఘు కావ్యాన్ని రచించినా, మరింకెన్నో రచనలు చేసినా అవి ఇప్పుడు ఏ కొందరికో తప్ప అందరికీ గుర్తులేవు. అయితే మూడు కోట్లు ఆంధ్రులున్న ఆనాటి నుంచి ఆరుకోట్ల ఆంధ్రులయిన ఈనాటి వరకూ వారి పేరు మార్మోగేది ఒకే ఒక గేయంతో; అది తెలుగు తల్లి సంకీర్తనం. మా తెలుగు తల్లికి మల్లెపూదండ. మా కన్నతల్లికి మంగళారతులు అంటూ ఆయన మాతృభూమిని మాతృ భాషలో చేసిన స్తవం తెలుగు భాష, తెలుగునాడు, తెలుగువాడు, తెలుగు తేజం ఉన్నన్ని రోజులూ ప్రతిధ్వనిస్తూనే వుంటుంది. ఒక వందేమాతరం లాగా (బంకిం చంద్ర ఛటర్జీ) ఒక జనగణ మనలాగా (రవీంద్ర నాధ ఠాగూరు) అది తెలుగు వారికి ఒక జాతి(య) గీతం.

ఇప్పుడు పేర్కొన్న మహనీయులంతా ఒకటో రెండో రచనలు చేసి ఏ ఒక్క దానివల్లో అజరామరమైన కీర్తిని పొందిన వాళ్ళు. కాని సంస్కృత సాహిత్యంలో ఒకే ఒక్క శ్లోక రచనతో ఆనాటి నుంచి నేటి దాకా రసిక రంజ

నంగా రసిక జన మనోహరంగా చేసిన ఆ ఒక్క శ్లోక రచనతో రసిక హృదయాల్లో నిలిచి పోయిన కవినాటి నుంచి నేటిదాకా ఒక్కడే ఒక్కడు...

ఆయన పేరు మాతృ గుప్తుడు.

ఆయన విక్రమార్క చక్రవర్తి కాలపువాడు.

ఆయన విక్రమార్కుని తరపున కాశ్మీర దేశాన్ని పరిపాలించినకవిరాజు.

అయితేనేం—ఆయన పేరు కవిగా నిలిచింది. 'నిద్రా దరిద్రుడనే'.

మాతృగుప్త కవిబిరుదం నిద్రాదరిద్రుడు. ఆయన చెప్పిన శ్లోక భావం పరిపుష్టమై రసవంతమై భావపూర్ణమైనందువల్ల ఆ ఒక శ్లోకం చేతనే ఆయన పేరు మరుగునపడి ఆయన బిరుదం 'నిద్రాదరిద్రుడు' శాశ్వతంగా నిలిచిపోయింది.

ఒక మహారాజు రాజ్యం చేసే బంగరు కాలంలో ఆ రాజు రసికుడై సరసుడై సంగీత సాహిత్యాల్ని పోషిస్తే ఆరాజ్యంలోని కవులే గాక గాయకులే కాక ఇరుగు పొరుగు రాజ్యం కవులు పండితులు గాయకులు కూడా ఇక్కడికి వచ్చి సభా ప్రవేశం చేసిసన్మానం పొందుతారు. అదికవులకున్న స్వేచ్ఛ ఒక దేశానికి ఒకకాలానికి కవులు బద్ధులుకారు కాలేరు అలాఎవరైనా అయితే వాడు అచ్చమైనకవి కాదన్న మాటే !

ఒక మహారాజు యధేచ్ఛగా చతురుదధి వేలా వలయిత మహీ మండలాన్ని ఏకచ్ఛత్రంగా పరిపాలిస్తే రాజు ప్రాపకం సంపాదించుకోగలిగిన కవికే భాగ్యం దక్కుతుంది. మిగతా కవులకు కానీ పండితులకుకానీ గాయకులకు కానీ ఆ అదృష్టం, ఆ అవకాశం దొరకదు ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు పాలించిన స్వర్ణయుగంలోనూ సంకుసాల నృసింహ కవివంటివాళ్ళకు వలసిన స్థానం దొరికిందికాదు. అలాటి వాళ్లు ఇంకెందరుండినారో మనకు నిక్కచ్చిగా తెలీదు.

అంతఃపుర ప్రవేశానికి రాజదర్బారులో చేరడానికి ఎన్నెన్నోద్వారాలు ద్వారం ద్వారం వద్ద ఒక్కో ఘటికుడు ఉంటాడు కదా ! ఉద్దండుడైన వికటకవి రామలింగ కవికే అంత సులువుగా భువన విజయ సభా ప్రవేశం దొరికింది కాదంటే నోరుమెత్తని నోరెత్తని వాళ్ళ మాట చెప్పాలా.

శ్రీ విక్రమార్క చక్రవర్తి పరిపాలన చేసే రోజుల్లోని కథ ఇది.

ఒక రోజు రాజుగారికి హఠాత్తుగా మెళుకువైంది. అపుడు సమయం యెంతైనదని భటుడిని అడిగాడు.

అతగాడు చాలా నిక్కచ్చిగా చెప్పాడు. అంత సరిగ్గా కాలగణనచేసి చెప్పగానే రాజుగారికి ఆశ్చర్యం వేసి అడిగాడు. దానికా భటుడు తనకి నిద్ర దూరం అని చెప్పాడు. ఎందుకు నిద్ర దూరం అంటే బ్రతుకు భారం.... రోజూ రావలసిన భటుడి స్థానంలో పొట్ట కూటి కోసం తాను రావలసి వచ్చిందని చెప్పాడు కవిగారు. రాజు గారికి నిద్రా భంగంతో ఆగక నిద్ర దూరమై వివరాలన్నీ అడిగాడు.

అప్పుడు భటుడిగా ఉన్న "మాతృ గుప్తుడు" అన్న "కవి" ఓ శ్లోకం చెప్పాడు అది ఇది.

జానే కోప పరాఙ్ముఖీ ప్రియతమా స్వప్నేద్య దృష్టా మయా॥
మామామ్ సంస్పృశ పాణినేతి రుదతీ గంతుం ప్రవృత్తాతతః
నోయావత్పరి రభ్య చాటుక శతై రాశ్వాస యామి ప్రియాం॥
భ్రాత స్తావ దహం శఠేనవిధినా నిద్రా దరిద్రః కృతః ॥

కోపంతో వెను దిరిగి పోతున్న ప్రియతమను ప్రసన్నం చేసుకోవాలను కుంటూ వుండగా నిద్రా భంగమై స్వప్న భంగమైంది. కల చెదరి పోవడంతో "కాంత" కదిలి పోయింది. కలలో కనిపించి అలరించి ఆపై కోపగించి వెళ్ళిపోయిన ఆ ప్రియురాల్ని మళ్లీ నిద్రపోయి మళ్లీ కలగని మళ్లీ ఆ ప్రియురాల్ని కలలోకి తెచ్చుకుని ఆమెని ప్రసన్నం చేసుకొని ఆమె ప్రేమను పొందుదామంటే నిద్దేరాదు. నిద్రా దరిద్రుడికి ఇక కల ఎక్క

ది? కళే లేకపోతే కలలోని కాంత ఎక్కడుంది? ఆమెను ప్రసన్నం చేసుకోవడం ఎక్కడుంది.

అస్సలు నిద్ర ముఖం ఎరగనయ్యా మహారాజా అని చెప్పడానికి ఆయన చెప్పిన శ్లోకం అది

ఈ "మాతృ గుప్తుని" ప్రస్తావన విశ్వనాథవారి కాశ్మీర దేశ నవలల్లో వస్తుంది. ఆ కాశ్మీర దేశనవలల్లో.... కల్హణుని రాజ తరంగిణి ఆధారంగా చేసుకొని విశ్వనాథవారు సృష్టించిన ఆరునవలల్లో "భ్రమర వాసిని" ఒకటి.

ఆ "భ్రమర వాసిని" నవలమీద పరిశోధన చేసిన సుగృహీత నామధేయ కాశీనాథుని సువర్చలాదేవిగారి సిద్ధాంత గ్రంథంలో వుంది ఈ శ్లోకం.

శ్లోకం ఎంత మధురమో ఎంత దుర్లభమో ఎంత శ్లాఘనీయమో స్మరణీయయో విశ్వనాథవారి భ్రమర వాసిని పై జరిగిన పరిశీలనం కూడా అంత ప్రశంస నీయం....పఠనీయం.... ఓ గొప్ప కవి గురించి చెప్పుకునే సమయంలో ఒక గొప్ప "వ్యాఖ్యానాన్ని" గూర్చి చెప్పుకోవడం తప్పుకాదనుకుంటాను.

—o—